ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 15 ఫిబ్రవరి 2025



సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజనగర్ తండా, లీల్యా నాయక్ తండాలలో శుక్రవారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ధర్మజాగరణ ప్రముఖులు సురేందర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ కార్యకర్తలు గుగ్లావత్ జలపతి, నగవత్ శ్రీను, తిరుమల్, జ్యోత్స్న, తండా మహిళలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

నిర్లక్ష్యం..



మూలమలుపు వద్ద ప్రమాదకరంగా కందకాలు

మల్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మల్యాల-పెగడపల్లి మార్గంలో నెల రోజుల క్రితం ఆప్టికల్ ఫైబర్ లైన్ ఏర్పాటుకు పనులు చేపట్టగా కొన్ని చోట్ల అసంపూర్తి పనులతో ప్రమాదకరంగా మారాయి. కేబుల్ ఏర్పాటుకు తవ్విన కందకాలను పూడ్చకుండా, ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో మల్యాల శివారులోని వైకుంఠధామం, మానాల మార్గం వరకు పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే అసంపూర్తి రహదారి పనులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ కందకాలు మరింత ప్రమాకరంగా మారాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉప్పొంగే ప్రవాహం..

నిండు కుండ

కొడిమ్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం పెద్ద చెరువు ఎల్లంపల్లి నీటితో నిండింది. దీంతో కొడిమ్యాల పెద్ద వాగు పారి పూడూర్ గ్రామ శివారులోని నాలుగు చెక్‌డ్యాంలు మత్తడి దూకటంతో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడిమ్యాల మైసమ్మ చెరువు నుంచి చందుర్తి, వేములవాడ, బోయినపల్లి మండలాల రైతులకు సాగు నీటికి ఇక్కట్లు ఉండవన్న అభిప్రాయాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహ మండలి మాజీ సభ్యుడు వెల్ముల రాంరెడ్డి వ్యక్తం చేశారు. ఎల్లంపెల్లి నీటిని నారాయణపూర్ చెరువు నుంచి కొడిమ్యాల మైసమ్మ చెరువు పోతారం చెరువు నింపించిన చొప్పదండి, వేములవాడ ఎమ్మెల్యేలు డాక్టర్ మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండలంలోని పూడూర్ గ్రామ శివారులో ఎల్లంపెల్లి నీటితో నిండిన చెక్‌డ్యాంలను సిరిసిల్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సందర్శించారు.



పెద్ద వాగుపై మత్తడి దూకుతున్న చెక్ డ్యాం

రవాణా శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కమటాల శ్రీనివాస్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల పట్టణంలో గల రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని కోరుతూ జగిత్యాల జిల్లా ఆర్టీఏ సభ్యుడు కమటాల శ్రీనివాస్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలో ఆటోమేటిక్ టెస్టింగ్ ఫిట్‌నెస్ స్టేషన్, సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్, వెహికిల్ సీజర్ యార్డులతో పాటు భావి అవసరాల నిమిత్తం 10 ఎకరాల స్థలాన్ని కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని కోరారు. కోరుట్ల పట్టణంలోని కార్యాలయానికి ఐదు ఎకరాలు అవసరమవుతుందని మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో పాటు కార్యాలయంలో పరిపాలన అధికారి పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే ఏవో పోస్టు భర్తీ చేయాలని, ప్రాంతీయ రవాణా అధికారి పోస్టులు కూడా భర్తీ చేయాలన్నారు. కార్యాలయంలో సాంకేతిక అవసరాల నిమిత్తం నూతన కంప్యూటర్లను మంజూరు చేయాలని కోరారు.



జిల్లాలో మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
జాబ్ కార్డులు	1.67 లక్షలు
మొత్తం కూలీల సంఖ్య	2.73 లక్షలు
శ్రమ శక్తి సంఘాల్లో ఉన్న కుటుంబాల సంఖ్య	1.05 లక్షలు
శ్రమశక్తి సంఘాల్లో ఉన్న కూలీల సంఖ్య	1.46 లక్షలు

'ఉపాధి' ప్రణాళిక ఖరారు..

- 37.85 లక్షల పనిదినాలు
- రూ. 82.03 కోట్ల నిధులు
- 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ కార్యాచరణ
- 'ఆత్మీయ భరోసా'తో ఉపాధి హామీ పనులకు పెరుగుతున్న డిమాండ్

జగిత్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నియంత్రించి కూలీలకు వంద రోజుల పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిల్లాలో చేపట్టాల్సిన పనుల కార్యాచరణ ప్రణాళికను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధం చేసింది. జిల్లాలో 20 మండలాల పరిధిలో రూ. 82.03 కోట్ల వ్యయంతో కూడిన 37.85 లక్షల పనిదినాలను కల్పించేలా ప్రణాళిక తయారు చేశారు.

● కూలి గిట్టుబాటయ్యేలా పనులు..

జిల్లాలో 2025-26 సంవత్సరానికి గానూ ఉపాధిహామీ పథకం కింద 37.85 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు. కూలీలు చేసిన ఉపాధి పనులతో పాటు మెటిరియల్ కాంపోనెంట్ కింద చెల్లించేందుకు గానూ మొత్తం నిధులు వ్యయం కానున్నట్లుగా ప్రతిపాదించారు. కూలీలకు రోజుకు రూ. 300 కూలి గిట్టుబాటయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతిపాదించిన నిధుల్లో కూలీలు చేసిన పనులకు గానూ అధిక వ్యయం అవసరం కాగా, మెటీరియల్ కాంపోనెంట్ కింద స్వల్ప నిధులు వ్యయం అయ్యే అవకాశం ఉండేలా కార్యాచరణ ఖరారు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గత యేడాది అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యాన్ని కల్పించి చేపట్టాల్సిన పనులను ఎంపిక చేశారు.

● జల సంరక్షణకు ప్రాధాన్యం..

ఉపాధిహామీ ద్వారా చేపట్టాల్సిన పనుల్లో జల సంరక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేలా ఇంకుడు గుంతలు, వాటర్ షెడ్లు, చెక్ డ్యామ్‌లు, చెరువుల్లో పూడిక తీత, పంట కాలువలు, నీటి కుంటల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. లబ్ధి చేకూర్చేలా ఉపాధి హామీ నిధులతో పశువుల షెడ్లు, నీటి తొట్టీలను నిర్మించుకునే అవకాశం కల్పించారు. నర్సరీల ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నీటి పారుదలకు సంబంధించి కాలువల పూడికతీత, పంట పొలాలకు అనుసంధాన రోడ్లు, హరితహారం కింద మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తీయడం, మొక్కల సంరక్షణకు నీటిని సరఫరా చేయడం వంటి పనులతో పాటు ఆయా గ్రామాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఇతరత్రా ఉపాధి పనులు చేపట్టనున్నారు.

● భారీగా డిమాండ్...

జిల్లాలో ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 39.99 లక్షల మొత్తం పనిదినాల లక్ష్యానికి గానూ ఇప్పటివరకు 35.91 లక్షల పనిదినాలు కల్పించారు. ఇంకా సుమారు 45 రోజుల గడువు ఉన్నందున ఆలోపు లక్ష్యం పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నారు. ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యంలో 89.81 శాతం పనులు పూర్తి చేశారు. కాగా రానున్న ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమయ్యే ఉపాధి పనులకు..

మిగతా 8లో..

పీఏసీఎస్‌ల పదవీకాలం ఆరు నెలలు పొడిగింపు

- నేటితో ముగియనున్న పాలకవర్గాల గడువు
- జిల్లాలో 51 పీఏసీఎస్‌లు

జగిత్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న 51 సంఘాల కాలపరిమితి, డీసీసీబీ చైర్మన్ పదవీ కాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గాల పదవీకాలం శనివారంతో ముగియనుంది. పాలకవర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎన్నికకు సంబంధించిన ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో సహకార సంగాల పాలకవర్గ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రామపంచాయతీ మండల, జిల్లా పరిషత్తులు, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం ఆ జాబితాలో చేరుతాయని అంతా భావించారు. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారా... లేక పాత పాలకవర్గానికే పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తారా... కాల పరిమితి పొడగిస్తారా అని రైతుల్లో చర్చలు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో సహకార సంఘాల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఎల్లమ్మ ఆలయాన్ని వీడీసీలోనే కొనసాగించాలి

- దేవాదాయశాఖమంత్రికి కోరుట్ల ఎమ్మెల్యే వినతి



మంత్రికి సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయాన్ని గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) పరిధిలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. కొన్నేళ్లుగా వెల్లుల్ల ఎల్లమ్మ దేవాలయం గ్రామాభివృద్ధి కమిటీ పర్యవేక్షణలోనే నిర్వహిస్తున్నా రన్నారు. ఆలయం కోసం గ్రామస్థులు ఏళ్ల నుంచి శ్రమిస్తూ అభివృద్ధి చేసు కుంటున్నారన్నారు. ఆలయన్నీ ఎండోమెంట్‌లోకి కలపడంతో గ్రామస్థులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆలయాన్ని ఎండోమెం ట్‌లోకి తీసుకోవడం సరియైన నిర్ణయం కాదని, ఈ విషయాన్ని పునరాలోచించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

నేడు హుండీ లెక్కింపు

కొడిమ్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపునకు ఆసక్తి గల భక్తులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి అప్పుల తిప్పలు

- బకాయిలు చెల్లించేదాకా అంబులెన్స్‌లకు డీజిల్ పోయనన్న బంక్ యాజమాని - రెగ్యులర్ సూపరింటెండెంట్ లేక ఇబ్బందులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అప్పుల తిప్పలు ఎదుర్కొంటున్నది. ఆస్పత్రిలో రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడంతో ఆస్పత్రికి కావాల్సిన వస్తువులన్నీ అరువు ప్రాతిపదికన తీసుకువస్తున్నారు. జగిత్యాల ప్రధాన ఆస్పత్రితో పాటు మాతా, శిశు కేంద్రం నిర్వహణ ప్రధాన ఆస్పత్రి పరిధిలోనే ఉంటుంది. అయితే రెండు నెలల క్రితం పలు ఆరోపణల నేపథ్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములును జిల్లా కలెక్టర్ సరెండ్ చేయగా, ఆస్పత్రి ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ సుమన్‌కు సూపరింటెండెంట్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయిలో బాధ్యతలు ఇవ్వకపోవడంతో బిల్లులు డ్రా చేసే అధికారం లేకుండాపోయింది. అయితే కొత్త సూపరింటెండెంట్ వస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పి సిబ్బంది ఆస్పత్రికి, మాతా, శిశు కేంద్రానికి



కావాల్సిన మందులు, సర్జికల్ కిట్స్, ఇతరత్రా వస్తువులు అరువు ప్రాతిపదికన తీసుకువచ్చారు. రెగ్యులర్‌గా డీజిల్ పోసే బంక్ యాజమాని వద్ద అంబులెన్స్‌లకు అరువుతో డీజిల్ పోయించారు. డీజిల్ బిల్లు రూ.లక్షకు పైగా దాటిపోవడంతో డబ్బులు మొత్తం చెల్లిస్తేనే డీజిల్ పోస్తామని బంక్ యాజమాని శుక్రవారం చెప్పడంతో ఆస్పత్రి సిబ్బంది యాజమానిని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ముఖ్యమైన మందులు తీసుకురావాల్సి ఉందని, లేదంటే సమస్యలు తలెత్తుతాయని బంక్ యజమానిని బతిమిలాడి డీజిల్ పోయించుకున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూ.80 లక్షలకుగా పైగా మందులు, సర్జికల్ కిట్స్ బిల్లులు పెండింగ్ ఉండగా, రూ.70 లక్షలకుగా పైగా కరెంట్ బిల్లు, రూ.25 లక్షలకు పైగా ఆస్పత్రి నిర్వహణ ఖర్చుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలుపుతున్నాయి. జగిత్యాల ప్రధాన ఆస్పత్రితో పాటు మాతా, శిశు కేంద్రానికి నిత్యం అనేకమంది అనారోగ్య సమస్యలతో వచ్చేవారితో పాటు మాతా, శిశు కేంద్రంలో ఒక్కో రోజు 25 నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతూ ఉంటాయి. వెంటనే రెగ్యులర్ సూపరింటెండెంట్‌ను నియమించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

పుల్వామా అమరులకు నివాళులు



రాయికల్‌లో నివాళులర్పిస్తున్న యువకులు, నాయకులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో శుక్రవారం పట్టణ యువత ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్‌లకు నివాళులు అర్పించారు. పట్టణంలో జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించడంతో పాటు 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పట్టణ యువకులు, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు మండలంలోని మాస్ట్రో పాఠశాల విద్యార్థులు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశాన్ని రక్షించడంలో సైనికుల పాత్ర గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ప్రాణాలు పణంగా పెట్టి శత్రువులను మట్టి కరిపించి దేశ ప్రజలను సైనికులు రక్షిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కథలాపూర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పోస్టల్ ఉద్యోగుల ధర్నా



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మల్లాపూర్, ఫిబ్రవరి, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యం పేట ఉప తపాల కార్యాయలం ఎదుట ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, డిపార్ట్‌మెంట్‌ను రక్షించే క్రమంలో భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట ధర్నా జరిపి నిరసన వ్యక్తం చేసినట్లు శాఖ ఉద్యోగులు తెలిపారు. ఉదయం సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి పోస్టల్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించా రు. సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ బీమా తదితర పథకాల వలన లబ్ధిదారులకు అందుతున్న తీరును వివరించారు. అకౌంట్ మేళాలో పలువురు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే సంజయ్‌ను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం, జాతర మహోత్సవాల సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను తిలకించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు అచ్యుత్ రావు, మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, నాయకులు చంద్రతేజ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

7

కలగానే మిగిలిన 'డబుల్' ఇళ్ల నిర్మాణం

- మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం

8

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య



భారతపు జల(ఫైల్)

జగిత్యాలరూరల్,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు జల(43) అనేవివాహిత అప్పుల బాధతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపినవివరాల ప్రకారం.. భారతపు జల-శ్రీనివాస్ భార్యభర్తలు కొన్నిరోజులుగా అప్పులబాధతో మన స్తాపం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గతనెల28వతేదీన జగిత్యాలరూరల్ మండలంలోని బాలపల్లి శివారులో గల తమ వ్యవసాయ పొలం వద్ద భార్యభర్తలు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మృతురాలు జల కుమారుడు ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందినతండ్రి శ్రీనివాస్ పరిస్థితి మెరుగుపడగా ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తల్లి జల పరిస్థితి విషమించడంతో కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించి శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..

చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కడెం తిరుమలేష్ (37) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం తిరుమలేష్ ఈనెల 11న తన పనిలో భాగంగా తన స్వగ్రామం తిమ్మాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వరపేట గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించారు. వరద కాలువకు అనుకోని ఉన్న పంపుహౌజ్ ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తి ఒంటిపై లేత వంకాయ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న..

కాపర్‌వైర్ దొంగల అరెస్ట్



పట్టుపడిన కాపర్ వైర్ దొంగలు

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వరుస కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్నినెలలుగా రామగిరి, మంథని అంతర్గాం మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఊరికి దూరంగాఉంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకొని అందులోని కాపర్‌వైర్‌ను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన మోటం దేవేందర్, మోటం రాంబాబు, సజ్జశిరీష, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన ఇప్ప గంగాధర్, పరతం రాములును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 35 కిలోల కాపర్‌వైర్, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన

నలుగురిపై కేసు నమోదు

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన ఎండీ మజీద్‌ను చంపుతామని బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12న మజీద్‌ను మండలంలోని చెందోళి గ్రామానికి చెందిన కటారి వంశీ, అశ్విన్ రావు, గుల్లకోట సత్యం, దావు తిరుపతి అనే నలుగురు వ్యక్తులు ఫోన్‌లో తిట్టారన్నారు. చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చి బాధితుడిని బూతులు తిడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో

వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్‌కేసులో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులకు పట్టుబడగా జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. గత సంవత్సరం డిసెంబరు 28న చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులో ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనీఖీ నిర్వహిస్తున్న క్రమంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ తిరుపతి పట్టుబడ్డాడు. అతడికి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 550/120 ఎంఎల్ రీడింగ్ రావడంతో అతడిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిరుపతిని కోర్టులో హాజరు పరచగా ఈ మేరకు స్పెష్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

చెక్ పోస్టు తనిఖీ




చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోభాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు కల్వచర్ల ప్రధాన రహదారి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎస్ఐ చంద్రకుమార్‌లు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డులను తనిఖీ చేపట్టారు.

కూలీలకు వరం జన్‌మన్ నరేగా

- అరచేతిలో ఈజీఎస్ సమాచారం
- అందుబాటులోకి కొత్త యాప్
- పారదర్శకత, నిధుల దుర్వినియోగానికి చెక్





చొప్పదండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేలా దీనిని రూపొందించారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పని, వేతనం వివరాలు, గ్రామాలలో ఉపాధి పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాది కూలీలకు యాప్ వరంగా మారనుంది.

కూలీల వేతనాల దుర్వినియోగానికి చెక్

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పనిచేశారో తెలియదు. ఉపాధిహామీ సిబ్బంది రాసిందే పని, వచ్చిందే వేతనం అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారో ఈ యాప్ ద్వారా కూలీలకు పూర్తిగా తెలుస్తుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లో జన్‌మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఆరు రకాల ఆప్షన్లు ఉంటాయి. మొదట ఆప్షన్‌ను నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్‌కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలను కనిపిస్తాయి.

జాబ్‌కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అటెండెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు, ఎన్ని రోజులు పనిదినాలు మిగిలి పోయాయనే వివరాలు కనిపిస్తాయి.

దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా చేయాల్సిన పని దినాలు కనిపి స్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు, ఎక్కడ పనిచేశారు. కూలీ ఎంత, ఎప్పుడు వారి ఖాతాల్లో జమ చేశారు, ఏ బ్యాంకులో జమ చేశారనే వివరాలు కనిపిస్తాయి. ఉపాధిహామీ డబ్బులు జమకాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్) లింకు అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింకు అయితే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగులో తప్పు గుర్తు ఉంటుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇసుకను తరలిస్తున్న గన్నేరువరం మండలం చొక్కరావుపల్లె గ్రామానికిచెందిన కాంపల్లిరవిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లుపేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్(52) అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ శనివారం సాయంత్రం కల్లుతీయడానికి తాటి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. గాయాలపాలైన శ్రీనివాస్ గౌడ్‌ను కరీంగనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6900 పలికింది. మార్కెట్ యార్డుకు 16మంది రైతులు 150క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6900, కనిష్ఠ ధర రూ.5400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తాను నిర్జీవం..అవయవాలు సజీవం

- యువ రైతు బ్రెయిన్‌డెడ్ ● అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



ముస్కు రాజేందర్‌రెడ్డి (ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి (35) అనేయువరైతు బ్రెయిన్‌డెడ్ కాగా కుటుంబసభ్యులు రైతు అవయవాలను దానంచేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఈనెల 10వతేదీన తల తిరుగుతోందని స్పృహతప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని ఆపరేషన్ చేశారు. అనంతరం వైద్య పరీక్షలకు హైదరాబాద్‌కి పంపించగా అక్కడ పరిశీలించిన వైద్యులు అతడు బ్రెయిన్ డెడ్‌ అయినట్టు నిర్ధారించారు. ఎనిమిది రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తాను చనిపోయినా ఎనిమిది మంది ప్రాణాలు నిలిపాడు. యువరైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థుడు

ముత్తారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో తాడిచర్ల బ్లాక్1,2 ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందలాదిలారీలలో ఇసుకను తరలిస్తుండడంతో దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కర్రె రాంచంద్రం అనే వ్యక్తి శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపాడు. రహదారిపై మంచం వేసుకొని పడుకొని ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా తాడిచర్ల బ్లాక్1,2 ఇసుకక్వారీ నుంచి వందలాది లారీలతో ఇసుకను తరలిస్తుండడంతో ఇండ్లలోకి దుమ్ముధూళి చేరుతోందన్నాడు. తాగే నీటిలో, తినే అన్నంలో దుమ్ము పడుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. లారీలు రాకపోకలతో రహదారి పూర్తిగా దెబ్బతిని మట్టి రోడ్డును తలపిస్తుందని అన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక క్వారీలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని పక్కకు తప్పించారు.

నకిలీ ధ్రువపత్రాలతో భూ విక్రయం

- 13 మందిపై కేసు నమోదు ● నలుగురు నిందితుల అరెస్టు



నిందితులను కోర్టుకు తీసుకెళ్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇతరుల భూమికి నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి, తప్పుడు హద్దులు చూపుతూ పలువురికి విక్రయించిన కేసులో ఎస్ఆర్ఎస్‌పీకి చెందిన ఇద్దరు అధికారులతోపాటు మరో 11 మందిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. ఈకేసులో నిందితులుగాఉన్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్‌కుచెందిన సర్వేనంబరు 954లో వావిలాలపల్లికి చెందిన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఆయన తల్లి సత్యవతి పేరిట 6 ఎకరాల 18 గుంటల భూమి ఉండగా ఇందులో నుంచి 34మందికి 4ఎకరాల వరకు ఇతరులకు విక్రయించాడు. మిగిలిన 2ఎకరాల 18 గుంటల భూమిలో ఎకరం 20గుంటల భూమిని మానేరు బైపాస్ రోడ్డు కోసం ప్రభుత్వం తీసుకుంది. ఇంకా దాదాపు 38గుంటల భూమిమిగిలి ఉంది. ఆయన అమెరికా వెళ్లారు. అదేసర్వే నంబరులో వెంకటేశ్వరరావు భూమిని ఆనుకుని పంతంగి రాంచందర్‌రావుకు 11గుంటల భూమి ఉంది. వెంకటేశ్వరరావు అమెరికాలో ఉంటున్నవిషయం తెలుసుకున్న బల్మూరి రమణారావు, దాసరి బుచ్చిరామిరెడ్డి, మహ్మద్ బషీర్ కలిసి ఒకముఠాగా ఏర్పడి వెంకటేశ్వరరావుకు చెందిన 38గుంటల భూమిని కాజేయాలని పథకం రచించారు. ఈ మేరకు పంతంగి రాంచందర్‌రావు భూమిని అధిక ధరకు కొనుగోలు చేస్తామని ఆశచూపి, 2014లో 41 గుంటల భూమిని 10మంది పేరిట రాంచందర్‌రావుతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వెంకటేశ్వరరావు 2022లో తనభూమిపై ఈసీ కోసం దరఖాస్తు చేయగా 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నో ఆబ్జెక్షన్(ఎన్ఓసీ) సర్టిఫికెట్ ఇవ్వడంలో ఇద్దరు అధికారులు సహకరించారు. దీనిపై బాధితుడైన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేయగా తప్పుడు పత్రాలతో 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ నేరానికి పాల్పడిన రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రాంచందర్‌రావు(83), కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్(54), కట్టరాంపూర్‌కుచెందిన బొల్లవేణి శంకర్(64), జ్యోతినగర్‌కుచెందిన బల్మూరి విజయ్‌కుమార్(46), గణేష్‌నగర్‌కుచెందిన దేశవాణి శంకర్(71), జగిత్యాలజిల్లా ఎండపల్లికి చెందిన మంతెన నర్సయ్య(54), కరీంనగర్ రాఘవేంద్రనగర్‌కు చెందిన నందికొండ మురళీధర్‌రెడ్డి(64), తిరుమలనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసరెడ్డి(40), మొగ్ధుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు(50), గణేష్‌నగర్‌కు చెందిన దాసరిసంజీవరెడ్డి(38),దాసరి బుచ్చిరాంరెడ్డి(67)తోపాటు ఎస్ఆర్ఎస్‌పీకిచెందిన ఇద్దరు అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

నిందితుల్లో బల్మూరి రమణారావు, దాసరి సంజీవరెడ్డి, దాసరి బుచ్చిరాంరెడ్డి, మొహమ్మద్ బషీర్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని, ఎస్ఆర్ఎస్‌పీ అధికారులపై విచారణ కొనసాగుతోందని సీఐ వివరించారు.

పూరిగుడిసె దగ్ధం



దగ్ధమైన పూరిగుడిసె

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నుంచి వ్యాపించిన మంటలు పూరిగుడిసెకు అంటుకోవ డంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు గ్రామానికి చెందిన శాఖపురపు లక్ష్మి గృహానికి అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఇంట్లో నగదు 50వేల రూపాయలతో పాటు, సామగ్రి కాలిబూడిద అయిందని బాధిత మహిళ లక్ష్మి తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనావేసి పైఅధికారులకు నివేదించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.

దళితుడిపై దాడి హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనం నడిపాడని తమిళనాడులో దళిత యువకుడిని అగ్రవర్ణాలవారు రెండు చేతులు నరికి వేయడం హేయమైన చర్య అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. దళితుడిపై దాడికి నిరసనగా జగిత్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కొత్త చట్టాలు రూపొందించి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. కేవం ఓట్ల కోసం, సీట్ల కోసం దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మద్దెల నారాయణ, తోట జగన్, సూరమల్ల సతీష్, రాజారత్నం, చంద్రయ్య, పుట్ట గంగాధర్, జక్కుల దేవయ్య, నర్ర రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యవ్యస్థ కుంటుపడి పోయిందని ప్రభుత్వం వెంటనే మంత్రి నియమించడంతో పాటు పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించడంతోపాటు పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్స్ కోసం కళాశాల యాజమాన్యాలు డబ్బులు కడితేనే ఇస్తామని వేధింపులకు గురిచేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అప్పులు చేసి డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్‌లను తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కుమార్, అజయ్, నిఖిల్, సమీర్, సంజయ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో లాభాలు


- కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్లో డిమాండ్



కాట్రపల్లిలో నాటుకోళ్ల షెడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గతంలో బంధువులేవరైనా ఇంటికివస్తే పెంచుకున్న కోళ్లను కోసి వండిపెట్టేవారు. కాలక్రమేనా నాటు కోళ్ల పెంపకం కనబడకుండా పోయింది. చాలామంది బ్రాయిలర్‌కోళ్లకు అలవాటు పడ్డారు. అయితే ఇటీవల బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోందని పుకార్లు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. ఒక నాటుకోడి గుడ్డును రూ.10 నుంచి 12వరకు విక్రయిస్తున్నాడు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన అల్లి సత్యరాజ్ అనేవ్యక్తి గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచేవాడు. లాభాలు తక్కువ వస్తున్నాయనే ఉద్దేశ్యంతో అదే షెడ్డులో నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఏడాది క్రితం వెయ్యి నాటు కోళ్లను తీసుకురాగా, లాభాలు వచ్చాయి. దీంతో మళ్లీ నాటు కోడి పిల్లలను తీసుకువచ్చి పెంచుతున్నాడు. ఈ కోళ్లకు ఆహారంగా దానతో పాటు పచ్చికూరగాయలు అందిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో నాటుకోడి రూ.400 పైన ఉన్నా ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. హుజూరాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల ప్రజలు వచ్చి నాటుకోళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఈకోళ్ల బాగోగులు చూసుకోవడం కోసం ఇద్దరు పనివారిని పెట్టుకున్నాడు. ఈపెంపకం గురించి తెలియడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆసక్తిగల పౌల్ట్రీ రైతులు వచ్చి సత్యరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

- వెయ్యి నాటు కోళ్లు పెంచుతున్నా..
- అల్లి సత్యరాజ్, పౌల్ట్రీ రైతు, కాట్రపల్లి



నాటు కోళ్ల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచడంతో ఆర్థికంగా నష్టపోయాను. ప్రస్తుతం వెయ్యి నాటు కోళ్లను పెంచుతున్నాను. మరో 15రోజుల్లో ఇంకో వెయ్యి కోళ్లను పెంచేందుకు షెడ్లను ఏర్పాటు చేస్తున్నాను. నాటు కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో కోడి రూ.400లకు విక్రయిస్తుండగా, గుడ్డును రూ.10నుంచి 12కు విక్రయిస్తున్నాను.


సుల్తానాబాద్‌లోని పెరికెగిద్ద అంజన్న ఆలయం

అంజన్న భూములు పక్కదారి

- ఆలయ భూముల్లో మున్సిపాలిటీ పాగా
- గోశాల పేరిట మరి కొందరి ఆధీనం
- ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోని అర్చకుడు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): అంజన్న ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాదాయశాఖ అధికారుల ఉదాసీనత వల్ల ప్రభుత్వ పరమయ్యాయి. ఆలయానికి భూములు ఉండడంతో అర్చకుడికి ధూపదీప నేవైద్యం స్కీంకు నోచుకోవడం లేదు. దాతలపై ఆధారపడి అర్చకులు కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపాలిటీ కొన్ని ఎకరాలను అనధికారికంగా తమ ఆధీనంలోకి తీసుకొంది. అందులో మామిడి తోట పెట్టారు కానీ ఏనాడూ ఆదాయం సమకూరిందీ లేదు. పూత, కాత లేదంటూ వచ్చిన ఫల సాయం కూడా మున్సిపాలిటీ వారే పంచుకుంటున్నారు.

సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామి ఆలయం గతంలో ప్రాచుర్యంలో ఉండేది. 1961లో అప్పటి పుర ప్రముఖులు ఆకుల మల్లయ్య, నారాయణ, సాదుల వెంకటనర్సయ్య తదితరులు సర్వే నంబరు 779లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేశారు. ఆలయ పరిధిలో దాదాపు పది ఎకరాలకు పైగా భూములు ఉండేవి. భూముల సాగు ద్వారా ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఆలయం ఊరికి దూరంగా ఉండడం, ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురైంది. దీంతో క్రమంగా ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పెద్ద ఎత్తున ఉండడంతో నాలుగు ఎకరాలలో స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. దాన్ని సాకుగా తీసుకుని కొందరు భూములను తమ ఆధీనంలోకి తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. 2016లో అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టడంతో ఐదు ఎకరాల అంజన్న భూములను తీసుకున్నారు. ఇప్పటికి మున్సిపాలిటీ ఆధీనంలోనే భూములున్నాయి. ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయం ముందున్న రోడ్డు, ఐసీడీఎస్ ఆఫీసు పక్కన ఉన్న మంచినీటి బావి కూడా ఆలయ భూముల కిందకే వస్తుంది. ఇలా ఆలయ భూములు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ పరంగా ధూప దీప నైవేద్యాల స్కీంలో అర్చకుడికి రావాల్సిన గౌరవ వేతనం రాకుండా ఆలయ భూములు అడ్డుపడుతున్నాయి. కొన్నేళ్లు ఆలయం నిరాదరణకు గురై ధూపదీప నైవేద్యాలకు కూడా నోచుకోలేదు. దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో మళ్లీ భక్తుల రాకపోకలు కొనసాగుతున్నాయి. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకుని అంజన్న ఆలయ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆలయ భూముల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని మామిడిచెట్లు

ఆలయ భూములు పరిరక్షించుకుంటాం

ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి

అంజన్న ఆలయం పరిధిలో పది ఎకరాల వరకు ఉంది. అందులో కొన్ని ఎకరాలు స్మశాన వాటికకు తీసుకున్నారు. అలాగే మున్సిపాలిటీ అనధికారికంగా ఐదెకరాల వరకు తీసుకొంది. ఇటీవల గోశాల పేరిట మరికొంత భూమి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆలయ భూములు లేకుండా పోయాయి. ఐసీడీఎస్ ఆఫీసు పరిధిలోని బావి వరకు, ఆలయం ముందు ఉన్న రోడ్డులో కూడా ఆలయ స్థలం పోయింది. ఆలయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూస్తాం.

చర్యలు తీసుకుంటాం

సుజాత దేవాదాయ శాఖ అధికారిణి

సుల్తానాబాద్‌లోని అంజన్న ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. మామిడితోట పెంచుతున్న భూములు దేవాదాయ శాఖకు చెందినవే. అధికారికంగా తాము ఎవరికీ బదలాయించలేదు. ఇటీవల నోటీసులు కూడా ఇచ్చాం. అర్చకునికి ధూప దీప నైవేద్యం స్కీం ద్వారా లబ్ధి చేకూర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ఆలయ భూములు కాపాడుకోవాలి

పల్లా మురళి వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్

పెరికి గిద్ద అంజనేయ స్వామి ఆలయానికి పది ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి ఇతరుల పాలయ్యాయి. ఆలయం, ఆవరణ మాత్రమే గుడి పరిధిలో ఉన్నాయి. మిగతా ఎకరాల కొద్దీ భూములు స్మశాన వాటికకని, చెట్ల పెంపకం కోసం అని తీసుకున్నారు. ఆలయ భూములను కాపాడుకోవాలి.

వైభవంగా భీమేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన జాతర రథోత్సవంతో ముగిసింది. రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, మల్లాపూర్, జగిత్యాల మండలాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ సమీప ప్రాంతం కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి క్యూలో నిల బడి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపైకి చేర్చారు. వేలాది మంది భక్తులు పోటీపడి దేవాలయం చుట్టూ ఐదుసార్లు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

నంబులాద్రి స్వామి రథోత్సవం

జాతరకు కిక్కిరిసిన భక్తులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామం లోని లక్ష్మీ నంబులాద్రి స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మీ నంబులాద్రి స్వామి వారలను మంగళవాయిద్యాలతో, పండితుల వేద మంత్రాలతో, మహిళల మంగళహారతులతో ఆలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న రథంపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

రథంపై ఉన్న స్వామి వారిని, ఆలయం లోపల ఉన్న మూల మూర్తి దర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ఈ నెల 8న స్వామి వారి కల్యాణోత్సవంతో నంబులాద్రి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారం భమయ్యాయి. శుక్రవారం రథోత్సవం జాతరతో ముగిసాయి. పలు జిల్లాలతోపాటు వైష్ణవ ఆళ్వార్లు ఎక్కువగా ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ఆట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్నదానం, పులిహోర తాగునీటి వసతి కల్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, సాగర్‌రావు, సంతోష్‌రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్ తదితరులు పాల్గొని స్వామిని దర్శనం చేసుకున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బా రెడ్డి, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సబ్ డివిజన్ నుంచి పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.


దేవునిపల్లి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథాన్ని లాగుతున్న భక్తులు


ఎస్‌యూ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో రెండు ఫార్మసీ కళాశాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు డిటెన్షన్ అవడం, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు లేకపోవడం వంటి వాటితో ఫార్మసీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శి సంపం గణేష్, జిల్లా నాయకులు అభిలాష్, ఉమేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో శుక్రవారం భక్తుల తాకిడి పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మ గుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు అనంతరం శ్రీబద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా వన మహోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారు ఏకాంతంగా విహార యాత్రకు వెళ్లేందుకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పండితులు పేర్కొన్నారు. గుట్ట కింది వనంలోకి గజవాహనంపై స్వామివారిని మేళతాళాలతో తీసుకువెళ్లి వనాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనాల వద్ద అటవీశాఖ అధికారులను, అర్చకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ జడ్పీటీసీ ముప్పాల జలజ, మాజీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసి స్టెంట్ రఘు, అటవీ శాఖ సెక్షన్ అధికారులు గంగారాం, ప్రకాష్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల్లో భాగంగా వనమహోత్సవంలో పాల్గొన్న అర్చకులు, పోలీసులు

రాజన్న ఆలయంలో రెండో భారీ ఫ్యాన్



వేములవాడ కల్చరల్ ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం శుక్రవారం రాత్రి ఈవో కె.వినోద్‌రెడ్డి నాగిరెడ్డి మండపం సమీపంలో రెండో భారీ ఫ్యాన్ ఏర్పాటు చేశారు. వేసవి సమీపిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఫ్యాన్ ఏర్పాటు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సన్నాహక సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించడంతో ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈ రామ్ కిషన్‌రావు, పర్యవేక్షకులు వరి నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

రాజన్న కోడె దాడిలో భక్తురాలికి గాయాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలిని శుక్రవారం కోడె గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చింది. కోడె మొక్కు చెల్లించుకునే సమయంలో ఆకస్మాత్తుగా కోడె దాడి చేయడంతో ఎల్లవ్వకు తీవ్ర గాయమైంది. దీంతో 108 ద్వారా ఎల్లవ్వను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎల్లవ్వ ఎడమ కాలికి బలమైన గాయమైనట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. రాజన్న ఆలయానికి కోడెమొక్కుల కోసం తీసుకువచ్చే కోడెలను దాడి చేసేవి కాకుండా సరైన కోడెలను ఎంపిక చేసి ఆలయానికి తీసుకురావాలిని, ఇలాంటి సంఘటనలు ఆలయంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న వృద్ధురాలు

క్యాన్సర్‌ను దూరం చేద్దాం

- చిన్నారులూ బాధితులే..
- నేడు చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

క్యాన్సర్ ఇప్పుడు మానవాళి ఆరోగ్య సమస్యల్లో ఒకటైపోయింది. ఎంతోమంది క్యాన్సర్ అనగానే జీవితమే ముగిసి పోయిందని మానసికంగా కృంగిపోతారు. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. కొన్ని రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉంది. క్యాన్సర్ బారిన పడి పెద్దలే కాకుండా చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. అందుకే క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించి చిన్నారులను రక్షించుకోవడానికి ప్రచార కార్యక్రమాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా మొదలయ్యాయి.

క్యాన్సర్ కొంతమంది కుటుంబాల్లో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వారు ముందుగా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పడడం అవసరమని చెబుతున్నా రు. క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా వందలో 24 సందర్భాల్లో పొట్టల్లో, అన్నవాహికలో వస్తున్నట్లుగా గుర్తించారు. 16 క్యాన్సర్లు ఊపిరితిత్తుల్లో, 15 క్యాన్సర్లు రొమ్ముకు, పేగులకు, ఊపిరితిత్తులకు దాదాపు 55సందర్భాల్లో క్యాన్సర్ వస్తున్నట్లుగా గుర్తించారు. వీటితో పాటు మూత్రకోశం, మూత్రపిండాల్లో 13, చర్మానికి 9, గర్భసంచి, అండాశయాల్లో, మిగతా అవయవాల్లో 14 శాతం క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్ వచ్చిన దాన్ని కనుక్కొని ఆపరేషన్ ద్వారా తొలగించడమనేది ఎంతో ఉపయోగపడుతుంది. ఆ తరువాత రెడియో థెరపీ, మందుల వాడకం వంటివి చేస్తే ఉపయోగం ఉంటుంది. క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంటుంది. పొగ తాగడం మానివేయాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తినాలని వైద్యులు చెబుతున్నారు.

ప్రపంచంలో ప్రతి ఏటా 2 లక్షల 50వేల మంది బాలబాలికలు క్యాన్సర్ బారినపడుతున్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశంలో 80శాతం బాలబాలికలు ఉన్నారు. వ్యాధిని గుర్తించకపోవడం వల్ల, తగిన వైద్య సదుపాయం అందకపోవడం వల్ల మృతిచెందుతున్నారు. క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్స చేస్తే కనీసం లక్ష మంది బాలబాలికల ప్రాణాలను కాపాడుకునే వీలు ఉంటుంది. అందుకే ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ పేరెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డేగా జరుపుతున్నారు. ఈ రోజున క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు అందుకు అవసరమయ్యే నిధులను కూడా సేకరిస్తారు.






స్తంభంపల్లిలో ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొన్న గ్రామస్తులు

హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు

వెల్గటూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఎడ్లబండ్ల పోటీలు అలరించాయి. ఈ పోటీలో గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామానికి చెందిన వెల్గటూర్ రమేష్‌కు చెందిన ఎడ్ల బండి ప్రథమ స్థానంలో నిలువగా అదే గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మణ్‌పావు తులం బంగారం అందజేశారు. జగదేవ్‌పేట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ద్వితీయ స్థానంలో నిలువగా జగిత్యాలకు చెందిన జీజీఎం పవన్ ఎనిమిది తులాల వెండిని అందజేశా రు. షేక్ ఇమ్రాన్, పత్తిపాక పెంటయ్యకు సంబంధించిన ఎడ్ల బండ్లు తృతీయ స్థానంలో నిలువగా స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాదం అన్విక్ పటేల్ నాలుగు తులాల వెండిని అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య, కమిటీ సభ్యులు గోరు వంతుల మహేష్, అన్నవేని మల్లేష్, యాగండ్ల రాజయ్య, అన్నవేని వెంకటేష్, రాపాక వెంకటేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన మైస ప్రశాంత్ గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతూ మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కిష్టంపేట గ్రామానికి చెందిన నల్లాల గంగారాం అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ బెజ్జంకి మోహన్, పీఏసీ ఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, విజయ్, భరత్, భూపతిపూర్ మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి గౌడ్, ఆడెపు హరి కృష్ణ, సిరిపురం సత్తయ్య, ఆకుల శ్రీనివాస్, వెంకటేష్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు, పెన్షనర్లకు నిమ్స్‌లో ఉచిత ఓపీ సేవలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో అవుట్ పేషెంట్ చికిత్సలు, పరీక్షలు ఉచితంగా చూస్తున్నారని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి హరి అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ కార్డు జిరాక్స్ తీసుకుని ఈహెచ్‌ఎస్ కౌంటర్ వద్దకు వెళ్లి నేమ్ ఎంట్రీ చేసుకుని ఓపీ కార్డు తీసుకోవాలన్నారు. డాక్టర్స్‌ను కలిసి, వారు రాసిన టెస్టులను మళ్లీ అదే బిల్డింగ్ లో ఈహెచ్‌ఎస్ కౌంటర్‌కు వచ్చి బిల్ చేయించుకుని పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, పెన్షనర్లు ఉచిత ఓపీ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

కలగానే మిగిలిన 'డబుల్' ఇళ్ల నిర్మాణం

- మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- చోద్యం చూస్తున్న అధికారులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తాయని ఎన్నో కలలు కన్న ఆదివాసీల కలలు కలలుగానే మిగిలిపోయాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి సారంగాపూర్‌లో రంగపేట గ్రామానికి బట్టపెల్లి-పోతారం పరిధిలోని గణేష్‌పల్లెకు డబల్ బెడ్ రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఈ రెండు గ్రామాల్లో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారు. బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామానికి 20 డబల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా చిన్నకొల్వాయి ఆదివాసీ గిరిజనులకు తొమ్మిది గృహాలు, కొల్వాయిలోని నిరుపేదలకు 11 గృహాలు కేటాయించారు. చిన్న కొల్వాయి గ్రామంలోని తొమ్మిది గృహాల నిర్మాణం కోసం పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. అయితే మూడు గృహాలకు సంబంధించిన లబ్ధిదారులు సొంత ఖర్చులతో మిగిలిపోయిన నిర్మాణాలు పూర్తి చేసుకొని వాటిలోనే నివాసం ఉంటున్నారు. కొల్వాయి గ్రామస్థులకు మొదట్లో కోమన్‌పెల్లి శివారులో ఇళ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేసి మధ్యలోనే వదిలేశారు. తరువాత కొల్వాయి గ్రామ లబ్ధిదారులకు దూరం అవుతుందని నేదునూర్‌లో గ్రామంలో మళ్లీ భూమి పూజ చేశారు. తమకు డబల్ బెడ్ రూం ఇళ్లు వస్తున్నాయని ఎన్నో కలలు కన్న లబ్ధిదారుల కలలు కలగానే మిగిలి పోయాయి. మధ్యలోనే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని ఎవరు పూర్తి చేస్తారు.. ఎవరిని అడగాలో అర్థం కాని అయోమయస్థితిలో లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత లబ్ధిదారులు కోరుతున్నారు.


చిన్న కొల్వాయి గ్రామంలో నిలిచిన నిర్మాణాలు

బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలారు..

- చెక్రు నాయక్

కట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లారు. నిధులు కూడా లేకపోవడంతో ఆలస్యం అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి.

'ఉపాధి' ప్రణాళిక ఖరారు

5వ పేజీ తరువాయి..

ఈ సారి భారీగా డిమాండ్ ఏర్పడే అవకాశముంది. ఎందుకంటే భూమిలేని కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరసా కింద యేడాది రూ. 12 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనికి ప్రాతిపదికన కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులకు వెళ్లిన కూలీలను అర్హులుగా గుర్తిస్తోంది. దీంతో జాబ్ కార్డు కలిగి ఉండి ఇప్పటివరకు పనులకు వెళ్లని వారు, జాబ్ కార్డు తీసుకోకుండా ఉన్న నిరుపేదలంతా ఉపాధిహామీ పనులకు హాజరయ్యేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా పనులు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తి చేస్తాము



జిల్లాలో ప్రభుత్వ లక్ష్యం మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనికల్పించే దినాలను పూర్తి చేస్తాము. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు లక్ష్యం పూర్తి చేసే దిశగా ముందుకు వెళ్తున్నాము. అదేవిధంగా రానున్న నూతన ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, పనిదినాలు తదితర కార్యాచరణను సిద్ధం చేశాము.

- రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, జగిత్యాల

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

పెగడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందు బాటులో ఉంటూ మరింత మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను, ఓపీ, ల్యాబ్ తదితర సేవలను పరిశీలించారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, మధుమేహం లాంటి వ్యాధుల సర్వే నిర్వహించాల ని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చర్మ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా 12 మంది చర్మవ్యాధి గ్రస్తులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి నరేష్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


చర్మవ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆదే మోహన్ అనే రైతుకు చెందిన పశువుల కొట్టం గురువారం అగ్నిప్రమాదానికి గురై పశువుల కొట్టంలో ఉన్న ఆవుతో పాటుగా, గడ్డివాములు దగ్ధమై తీవ్రనష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ శుక్రవారం జాబితాపూర్‌లోని సంఘటనస్థలాన్ని వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితుడికి ప్రభుత్వపరంగా సహాయం అందించి అండగా ఉంటామని తెలిపారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ సంఘటన జరిగిన తీరు చాలా కలిచివేసిందని, వెంటనే ప్రభుత్వం బాధితుడికి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుబ్బవాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. 30వ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి వేద మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పరిమి నర్సయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆర్మూర్ నరేందర్, పురుషోత్తం, రాజేష్, హేమచందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంద్రల్లపల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, గం గారాంతండా, హిమ్మతురావుపేట, శనివారంపేట రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

కథలాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన చీటి జగన్‌రావును శుక్రవారం అంబారిపేటలో కాంగ్రెస్ శ్రేణులు సన్మానించారు. రైతుల సంక్షేమం కోసం పాటు పడాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, తిక్క రవి, మల్లేశం, దేవయ్య, నవీన్, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లి, చింతకుంట గ్రామాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు అందజేశారు. చింతకుంటలో పోకతోట లింబాద్రికి రు. 37,500, రాజారాం తండాకు చెందిన నాలింటికి రు. 57,500, ఇప్పపల్లిలో యాగండ్ల దేవక్కకు రు. 60 వేలు, కుక్కదువ లింగంకు రు. 60 వేలు, చింతల జనార్ధన్ రు. 29 వేలు, గుగ్గిళ్ళ రాజుకు రు. 39 వేల చొప్పున మంజూరైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో వేముల కృష్ణ, ప్రభాకర్, మహేశ్, గండి రాజేశ్, మల్యాల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

నరేందర్‌రెడ్డి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


పుల్వామా అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

జగిత్యాల అర్బన్/ధర్మపురి/కోరుట్ల/మెట్‌పల్లిటౌన్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల పట్టణం, ధర్మపురిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జగిత్యాలలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సంవత్సరంలో 56 వేల ఉద్యోగాలు కల్పించి యువకులకు మేలు చేసిందన్నారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు చట్టబద్ధత కల్పించి అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొంత మంది సోషల్ మీడియాలో తనపై బురదజల్లుతూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. విద్యాభివృద్ధి కోసం కంకణం కట్టుకుని పనిచేస్తున్న తనను నిందలపాలు చేయడం తగదన్నారు. అంతకుముందు పుల్వామా దాడిలో మృతి చెందిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు జువ్వాడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని మల్లన్న ఆలయంలో జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మల్లన్న స్వామి ఆలయాన్ని పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని యాదవులు, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం, కానుకలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ సుజిత్‌రావు, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన నాయకులకు యాదవ సంఘం నాయకులు, ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు శాలువలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ మహిపాల్‌యాదవ్, వైస్‌చైర్మన్ చానమనేని బాల్‌రాజ్, నాయకులు చౌటుపల్లి అంజయ్య, పాలేపు రాజన్న, పవన్, మహేష్, స్వామి, నారాయణ, నల్లూరి సాగర్, యాదవ సంఘం, ఆలయాభివృద్ధి, గ్రామాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మల్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మల్యాలలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు బ్లాక్ చౌరస్తా వద్ద ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం ప్రారంభించారు. విద్యావేత్త నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్, తిరుపతి, హనుమంతు, జగదీశ్వర్, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రమాద బీమా చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన తిరుమన్‌దాసు సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరు అయిన రూ 1,00,000 చెక్కును భార్య శోభారాణికి శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మపురి పీఏసీఎస్ సభ్యుడైన సత్యనారాయణ రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.. దీంతో నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రమాద బీమా రూ. లక్ష చెక్కు మంజూరు అయ్యింది. కార్యక్రమంలో కేడీసీసీ ధర్మపురి బ్రాంచ్ ఫీల్డు ఆఫీసర్ ప్రవీణ్, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరి రాజేష్, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా విద్యాసంస్థల బంద్

కథలాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా జరగలేదని నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం మాల సంఘం నాయకులు విద్యాసంస్థలను బంద్ చేయించారు. ప్రభుత్వం ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ చేసి రాజ్యాంగ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. గతంలో వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుతో మరోసారి తమ అధికార బలాన్ని ఉపమోగించి వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇప్పించారని విమర్శించారు. ఎంఈవో లోకిని శ్రీనివాస్‌తో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు బంద్ పాటించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల సంఘ నాయకులు దయ్యా ప్రశాంత్, బత్తుల నరేశ్, కోట శంకర్, తలారి మోహన్, మైస శంకర్, బుర్రి శ్యాం, సిద్ధు తదితరులు ఉన్నారు.

కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ జయంతి వేడుకలు


ధర్మపురి పట్టణంలో సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ధర్మపురి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ జయంతి వేడుకలు శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు విషయంలో బిల్లు పాస్ కోసం ఆమె తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. సుష్మా స్వరాజ్‌కు యావత్ తెలంగాణ ప్రజలు రుణ పడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, పట్టణ మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, ఆకుల శ్రీనివాస్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, సంగి మాధవ్, మండలోజు సూరజ్, అనిల్, మల్లేష్, శ్రీనివాస్, ప్రణీత్, మదుసూధన్, శివసాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.


కథలాపూర్‌లో..

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి దివంగత సుష్మాస్వరాజ్ జయంతి వేడుకలు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుష్మాస్వరాజ్ తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకోవద్దని శాంతియుతంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పుల్వామా దాడిలో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మంగళి మహేశ్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరెడ్ల రవి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


విద్యార్థులతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి

కొడిమ్యాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా సంక్షేమ అధికారి నరేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ప్రతీ నెల బాలామృతం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మల్యాల సీడీపీవో వీరలక్ష్మీ, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మన్, అంగన్‌వాడీ టీచర్ హసీనా, హెల్పర్లు, తల్లులు, పాల్గొన్నారు.

భూగర్భ జలాలను పెంచేందుకే 'పీటీ'లు


పనులను పరిశీలిస్తున్న ఉపాధిహామీ పథకం పీడీ రఘువరన్

మేడిపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు వృథాగా పోనివ్వకుండా ఉండేందుకు, భూగర్భ జలాలను పెంచేందుకే పెర్కోలేషన్ ట్యాంకు (పీటీ)ల నిర్మాణం జరుగుతుందని ఉపాధిహామీ పథకం పీడీ రఘువరన్ తెలిపారు. శుక్రవారం మేడిపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతంలో జరుగుతున్న పీటీ పనులను పరిశీలించారు. పెర్కోలేషన్ ట్యాంకుల ద్వారా నీటి నిల్వలతో పాటు భూమిపై పొర కోతకు గురికాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అయన వెంట ఈసీ ప్రవీణ్, టీఏ వేణుగోపాలాచారి ఉపాధిహామీ కూలీలు తదితరులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన


మెట్‌పల్లిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోరుట్ల/ మెట్‌పల్లి టౌన్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు 9వ మెట్రోపాలిటన్ జిల్లా జడ్జిపై నేరస్థుడు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని కోర్టుల ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు. న్యాయ వ్యవస్థను కాపాడే విధంగా చట్టాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు తస్నీర్ శ్రీనివాస్‌రావు, సుతారి శ్రీనివాస్, చిలువేరి రాజశేఖర్, సురేష్, రఘు, సత్యం, శ్రీనివాస్, గంగాధర్, అమరేందర్ రావు, మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు పుప్పాల లింబాద్రి, వేణుగోపాల్ రావు, రాంబాబు, శ్రీనివాస్, వెంకటస్వామి, రాజ్ మహ్మద్, ఉజ్జల శ్రీనివాస్, యుద్ధవీర్, అల్లాల సత్యనారాయణ, మహిళా న్యాయ వా దులు స్రవంతి, మానస, కావేరి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు బారసాల

కోరుట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బజార్ ప్రాంతంలోని సంతోషీ మాత ఆలయంలో ఉండే ఆవు 20 రోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. శుక్రవారం గోమాతకు బారసాలను పెంపకం దారు కొలిపాక భీమయ్య-లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా అలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గోమాతలకు బారసాల నిర్వహించంగా కాలనీ వాసులు పాల్గొన్నారు. దూడకు నందీశ్వరుగా నామకరణం చేశారు. కార్యక్రమంలో వైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్త సురేష్- స్వరూప దంపతులు పాల్గొన్నారు.


గోమాతకు బారసాల నిర్వహిస్తున్న భక్తులు

యువతి వివాహానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన హనుమండ్ల రాజేశం-రాధ దంపతుల కుమార్తె లావణ్య వివాహానికి జగిత్యాల పట్టణానికి చెందిన భక్త మార్కండేయ యువజన సేవా సమితివారు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

దీంతో పాటు గీత సిల్క్ హౌజ్ యాజమాని కస్తూరి శశిధర్ పెళ్లి పట్టు చీరెను అందించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చిలుకమర్రి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కొక్కుల సుదర్శన్, ఆకుబత్తిని శ్రీనివాస్, అనుమల్ల శ్రీనివాస్, మానపురి శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్, బోగ మల్లేశం, మాచర్ల శంకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.